

సోమశిలలో 57.34 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 57.34 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3150 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.88,780
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,026
మూడు శాతం జీఎస్టీతో	రూ.8,267
సవర (8 గ్రాములు)	రూ.66,136

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.6 /24.7

జిల్లాలో వాతావరణం శుక్రవారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 33 శాతంగా గురువారం నమోదైంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్రవారం	శనివారం
సా: 6.19	ఉ: 5.03

న్యూస్‌రీల్

పైప్‌లైన్‌ను దౌర్జన్యంగా ఎలా వేస్తారు..?

- అధికారులను ప్రశ్నించిన రైతులు



ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం

కావలి: కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాద్ వరకు బీపీసీఎల్ సంస్థ తలపెట్టిన పైప్‌లైన్‌ను తమ భూముల్లో ఎలా వేస్తారని రైతులు ప్రశ్నిస్తుంటే, ఏర్పాటు చేసి తీరుతామంటూ అధికారులు, సంస్థ ప్రతినిధులు దబాయిస్తున్నారని పలువురు వాపోతున్నారు. కావలి రూరల్ మండలం సర్వాయపాళెం, మాతినివారిపాళెం, కోనేటివారిపాళెం రైతులతో స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ సన్ని వంశీకృష్ణ గురువారం చర్చించారు. ప్రస్తుతం పంట కోత దశకొచ్చిందని, 20 రోజులాగితే ఇది పూర్తవుతుందని, గ్రామాల్లో సమావేశాలను ఏర్పాటు చేసుకొని తమ నిర్ణయాన్ని తెలియజేస్తామని రైతులు చెప్పారు. కాగా పైప్‌లైన్ నిర్మాణ పనులను ఈ నెల 11న ప్రారంభించనున్నామని, పంట నష్టానికి పరిహారాన్ని చెల్లిస్తామని ఆర్డీఓ సమక్షంలో బీపీసీఎల్ ప్రతినిధులు చెప్పగా, రైతులు అంగీకరించలేదు. ఆర్డీఓ సైతం ఇలానే చెప్పడంతో వారు బయటకొచ్చేశారు. అనంతరం రైతులు మాట్లాడారు. గ్రామాల్లో భయోత్పాతాన్ని సృష్టించి.. అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూముల్లో పైప్‌లైన్‌ను నిర్మించే అవకాశమున్నా, తమ భూముల్లోనే నిర్మించాలంటూ మొండిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సన్నకారు రైతుల భూముల్లో నిర్మించి పొలాలను ధ్వంసం చేసి జీవనాధారాన్ని దెబ్బతీసే వాతావరణాన్ని అధికారులు సృష్టిస్తున్నా రని వాపోయారు. దిక్కున్న చోటకెళ్లి చెప్పకోండంటూ దారుణంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని తాము ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేదిలేదని స్పష్టం చేశారు.

జిల్లా సహకారాభివృద్ధి కమిటీ సమావేశం



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు రూరల్: జిల్లాలోని వ్యవసాయ, పాడి, మత్స్య సహకార సంఘాలను పటిష్టపర్చి, సభ్యులకు మరింత మెరుగైన సేవలందించాలని కలెక్టర్ ఆనంద్ కోరారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో గురువారం నిర్వహించిన జిల్లా సహకారాభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కంప్యూటరీకరించిన వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో మాన్యువల్ విధానంలో లావాదేవీలను నిర్వహించరాదని, ఆన్‌లైన్ ద్వారానే జరపాలని సూచించారు. అర్హత కలిగిన అన్ని పీఏసీఎస్‌లలో పెట్రోల్ బంకులు, ఎల్పీజీ గ్యాస్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ఏరియా ప్రభుత్వాస్పత్రుల్లో ప్రధానమంత్రి జనఔషధి కేంద్రాల ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. డీసీఓ గుర్రప్ప, డీసీసీబీ సీఈఓ శ్రీనివాసరావు, నాబార్డు డీడీఎం డాక్టర్ బాబు, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగేశ్వరరావు, జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శనగ రైతు.. దైన్యం

- ఈ ఏడాది ఆర్థికంగా కుదేలు

శనగను సాగు చేసిన రైతుల పరిస్థితి దీనంగా మారుతోంది. ఖర్చులు, పెట్టుబడి గణనీయంగా పెరిగినా, దిగుబడులు అంతంతమాత్రమే వస్తుండటం వీరిని కలవరపాటుకు గురిచేస్తోంది. మద్దతు ధర లభించకపోవడం ఓ ఎత్తయితే.. కొనుగోలు కేంద్రాలను నేటికీ ప్రారంభించకపోవడంతో అన్నదాతల ఆందోళన వర్ణనాతీతమవుతోంది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తుండటంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

- పెరిగిన ఖర్చులు.. తగ్గిన దిగుబడులు
- నానాటికీ పతనమవుతున్న ధరలు
- నేటికీ ప్రారంభం కాని కేంద్రాలు



వింజమూరు మండలం రావిపాడులో సాగులో ఉన్న శనగ



పొలాల్లో విక్రయానికి సిద్ధంగా..

గుడిదయగిరి: జిల్లాలో శనగను సాగు చేసిన రైతులను ఈ ఏడాది నష్టాలు వెంటాడుతున్నాయి. పెరిగిన పెట్టుబడులు.. కూలీ ఖర్చులు.. తగ్గిన దిగుబడులు.. గిట్టుబాటు లేని ధరలతో ఆర్థికంగా చితికిపోతున్నారు. ఆపదలో ఉన్న అన్నదాతను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఏ మాత్రం కనికరించడంలేదు. ఫలితంగా అప్పులతో ఆర్థికంగా కుదేలవుతున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో శనగ విస్తీర్ణం సాధారణంగా 11,833 హెక్టార్లు కాగా, ఈ రబీ సీజన్లో 3436 హెక్టార్లలోనే సాగు చేశారు. వాస్తవానికి జిల్లాలో శనగను నవంబర్‌లో వేస్తారు. అయితే వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో కాస్త ఆలస్యంగా ప్రారంభించారు. చీడపీడల ఉధృతి అధికంగా ఉండటంతో సాగు ఖర్చులు గణనీయంగా పెరిగాయి. ఆ మేరకు దిగుబడులు రాకపోగా, మరింత తగ్గడం వీరిని ఆవేదనకు గురిచేస్తోంది.



కోత కోసి.. ఎండబెట్టిన కట్టె

తగ్గుతున్న ఆసక్తి

జిల్లాలోని మెట్ట మండలాలైన పొదలకూరు, చేజర్ల, అనంతసాగరం, అనుమసముద్రంపేట, కలిగిరి, వింజమూరు, కొండాపురం, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో ఎక్కువ మంది రైతులు శనగను సాగు చేసేవారు. అయితే ఇందులో లాభాలు రాకపోవడంతో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించారు.

నిరాశాజనకంగా ధరలు

శనగ రైతులకు ఖర్చులు, పెట్టుబడులు ఏటా పెరుగుతున్నా, ఆ మేరకు ధరలు మాత్రం లభించడంలేదు. ఒక ఎకరాలో సాగు చేసేందుకు కనీసం రూ.20 వేల నుంచి రూ.25 వేలు వెచ్చించాల్సి వస్తోంది. అయితే ధర ప్రస్తుతం క్వింటా రూ.ఐదు వేలే పలుకుతోంది. దిగుబడి మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల మేరే వస్తోంది. ఇలా చూస్తే ఎకరాకు కనీసం రూ.ఐదు వేల వరకు నష్టం తప్పడంలేదు. ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర రూ.5,650గానే ఉంది. కొనుగోలు కేంద్రాలను నేటికీ ఏర్పాటు చేయలేదు. పైగా ఇందులో సవాలక్ష నిబంధనలతో కోత పెడుతున్నారనే ఆరోపణలూ లేకపోలేదు. దీంతో వచ్చిన ధరలకే దళారులకు రైతులు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సాగులో ఎంతో వ్యత్యాసం

వ్యవసాయ సబ్ డివిజన్	సాగు చేసింది	సాధారణంగా సాగయ్యేది (హెక్టార్లలో)
ఆత్మకూరు	1178	3076
కావలి	1314	2854
నెల్లూరు	39	68
కందుకూరు	905	5835

వంచనకే ప్రభుత్వం పరిమితం

వాతావరణ పరిస్థితులు అనుకూలించక రైతులు నష్టాల పాలవుతున్నా, ప్రభుత్వం ఏ మాత్రం కనికరించడంలేదు. నాటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా పేరుతో ఏటా రూ.13 వేలను అందజేసేవారు. ప్రకృతి విపత్తుల సమయంలో వీరిని ఆదుకునేందుకు గానూ పైసాను వసూలు చేయకుండానే ఉచిత పంటల బీమాను అమలు చేసేవారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తోంది. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేలను ఇస్తామని ప్రకటించినా, నేటికీ అతీగతీలేదు.

నష్టాలు తప్పడంలేదు



మూడెకరాల్లో శనగ సాగు చేశా. పెట్టుబడిగా ఎకరానికి రూ.25 వేల చొప్పున రూ.75 వేలైంది. దిగుబడి పది క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రస్తుత ధర మేరకు రూ.50 వేలే లభించేలా ఉంది. దీని బట్టి నష్టం తప్పేలా లేదు. మద్దతు ధరను పెంచి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

– సురేష్, రైతు, పార్లపల్లి, కొండాపురం మండలం

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

జిల్లాలో సాగు చేసిన శనగ నూర్పిళ్లను ప్రస్తుతం చేస్తున్నారు. వీటిని మార్క్‌ఫెడ్, రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. వీరి నుంచి ఆదేశాలు రాగానే కొనుగోలు చేస్తాం.

– సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

నమ్మండయ్యా.. ఇక్కడే హాస్టల్..!

హలో.. ఈ ప్రాంతంలో ప్రభుత్వ వసతిగృహం ఉందంట.. అదెక్కడ అని మూలాపేటలోని అలంకార్ సెంటర్ వద్దకెళ్లి ఎవర్ని ప్రశ్నించినా, అయోమయపు ముఖాన్ని ప్రదర్శిస్తారు. కష్టపడి ఆరాతీసి.. చివరికి అక్కడికెళ్లి పరిశీలిస్తే, గగుర్పాటుకు గురవడం ఖాయం. షాపింగ్ కాంప్లెక్స్ మధ్య ఇరుకైన సందులో.. జనావాసాల మధ్య దీని నిర్వహణ చూసి మీకో నమస్కారం అంటూ తమ పిల్లలను అందులో చేర్పేందుకు ఎవరూ సాహసించడంలేదు. అసలు ఈ తరహాలో ఎందుకు నిర్వహిస్తున్నారో ఎవరికీ అంతుచిక్కడంలేదు.

షాపింగ్ కాంప్లెక్.. నివాసాల మధ్య

- రెండు ఇరుకు గదులే విద్యార్థినులకు దిక్కు
- రక్షణా ప్రశ్నార్థకమే
- ఆరేళ్లుగా ఇక్కడే నిర్వహణ
- అధికారుల వింతపోకడ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గిరిజన శాఖ నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. విద్యార్థినుల కోసం ఆ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టల్ ప్రాంతాన్ని పరిశీలిస్తే వారి వ్యవహారమేంటో ఇట్టే అర్థమవుతుంది. మూలాపేటలోని అలంకార్ సెంటర్‌లో సంక్షేమ వసతిగృహం ఉందంటే ఎవరూ నమ్మరు. కారణం ఇక్కడ కనిపించే పరిస్థితులు. ముందు షాపింగ్ కాంప్లెక్స్.. వెనుక హౌసింగ్ కాంప్లెక్స్‌లో రెండు ఇరుకు గదుల్లో దీన్ని నిర్వహిస్తున్నారంటే ఆశ్చర్యం కలగకమానదు.

అంతా లోపభూయిష్టం

ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థినులకు హాస్టల్‌ను అలంకార్ సెంటర్‌లో గిరిజన శాఖ ఆధ్వర్యంలో సాగిస్తున్నారు. చదువుకునేందుకు.. ఆడుకునేందుకు.. కనీసం ఒక చోట భోజనం చేసే అవకాశమే ఇక్కడ కానరాదు. ఇలాంటి చోట ఎందుకు నిర్వహిస్తున్నారో అధికారులకే తెలియాలి.

చేరేందుకు వెనుకంజ

హాస్టల్లో ఆన్‌రోల్ 39 మంది ఉండగా, ప్రస్తుతం 19 మంది విద్యార్థినులు ఇక్కడ ఉంటూ చదువులను కొనసాగిస్తున్నారు. ఇక్కడ వంద మందిని చేర్చుకునే అవకాశం ఉన్నా, హాస్టల్ పరిస్థితి చూసి ఎవరూ ముందుకురావడంలేదు. షాపింగ్ కాంప్లెక్స్‌లో ఇరుకైన ద్వారం మీదుగా లోపలికి వెళ్తేనే అక్కడ హాస్టల్ ఉందనే విషయం తెలుస్తుంది. బోర్డును తీసి మూలనపడేశారు. చుట్టూ అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశంలో వంటలు చేస్తున్నారు. ఇక్కడే విద్యార్థినులు భోజనం చేయాల్సి వస్తోంది. జనావాసాల మధ్య నిర్వహిస్తుండటంతో విద్యార్థినులకు రక్షణ ప్రశ్నార్థకమవుతోంది.



హాస్టల్‌కు వెళ్లాలంటే.. ఈ ఇరుకు దారే దిక్కు

నెలకు రూ.22 వేల అద్దె

మొదటి అంతస్తులోని రెండు ఇరుకు గదుల్లో విద్యార్థినులు ఉంటున్నారు. దుస్తులను ఉతికి ఆరేసే పరిస్థితీ కరువవుతోంది. కాపురాలు ఉండాల్సిన ఇళ్లలో ఇలా హాస్టల్‌ను నిర్వహిస్తూ, దీనికి ప్రతి నెలా రూ.22 వేల అద్దెను చెల్లిస్తున్నారు. మరోవైపు ఇక్కడే ఉండే వారు డీకేడబ్ల్యూ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. కాలేజీకి కిలోమీటర్ దూరంలో వసతిగృహాన్ని నిర్వహించాల్సిన అవసరం ఏముందని చుట్టుపక్కల వారు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థినులపై నిర్లక్ష్యమో లేక ఉన్నతాధికారుల లాభసాటి వ్యాపారమో తెలియదు గానీ ఆరేళ్లుగా ఇక్కడే నిర్వహిస్తున్నారు. కాగా ఈ విషయమై అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ అంకయ్య, జిల్లా ట్రైబల్ అధికారి పరిమళను సంప్రదించగా, స్పందించేందుకు వారు ఆసక్తి చూపలేదు.



విద్యార్థినులుండే గదులు.. అవతలే నివాసాలు

చర్యలు చేపడతాం

హాస్టల్ నిర్వహణపై విచారణ జరిపి చర్యలు చేపడతాం. వీలైనంత వరకు అన్ని వసతులు ఉన్న అద్దె భవనానికి హాస్టల్‌ను మార్చేందుకు యత్నిస్తా. ఇటీవలే చార్జి తీసుకున్నా. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడతా.

– మల్లికార్జునరెడ్డి, ఐటీడీఏ పీఓ

జాతీయ లోక్‌అదాలత్ రేపు



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి యామిని

నెల్లూరు (లీగల్): ఈ నెల ఎనిమిదిన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ విజయవంతానికి కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని పేర్కొన్నారు. జిల్లా కోర్టులోని తన చాంబర్‌లో విలేకరులతో గురువారం ఆమె మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నామని, నెల్లూరు, కోవూరు, కావలి, గూడూరు, వెంకటగిరి, ఆత్మకూరు, కోట, ఉదయగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట కోర్టుల్లోని కక్షిదారులు సద్వినియోగం చేసుకొని కేసులను రాజీ చేసుకోవాలని కోరారు. ఐదో అదనపు జిల్లా జడ్జి సరస్వతి, పోక్సో ప్రత్యేక కోర్టు జడ్జి సుమ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి తదితరులు పాల్గొన్నారు.

అదే మిల్లర్ పంథా

అన్నదాతలకు తాజాగా రూ.70 లక్షల మేర ఎగనామం

- 13 మంది నుంచి ధాన్యం సేకరించి మొండిచేయి
- గతంలోనూ రూ.5.6 కోట్ల మేర టోకరా
- పరారీలో శేఖర్‌బాబు

నెల్లూరు (పొగతోట): ఆరుగాలం శ్రమించి వరిని పండించిన రైతులను దోచుకోవడమే ధ్యేయంగా మిల్లర్ శేఖర్‌బాబు చెలరేగిపోతున్నారు. నెల్లూరుకు చెందిన ఈయన గతంలో 250 మంది రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి రూ.5.6 కోట్లు ఇవ్వకుండా మోసగించిన విషయం తెలిసిందే. తాజాగా గత నెల్లో 13 మంది నుంచి రూ.70 లక్షల విలువజేసే ధాన్యాన్ని సేకరించి తన పాత పంథానే అవలంబించారు. చేసేదిలేక నవాబుపేట పోలీసులను రైతులు ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఆయన్ను పట్టుకునేందుకు యత్నాలను ముమ్మరం చేశారు.

నిస్సహాయ స్థితిని సొమ్ము చేసుకుంటూ..

రైతులను ఇబ్బంది పెట్టే రైస్‌మిల్లర్లు కావలి, నెల్లూరు, తదితర ప్రాంతాల్లో అధికంగా ఉన్నారు. జిల్లాలో వరి కోతలు ఊపందుకోగా, ధాన్యాన్ని కల్లాల్లో నిల్వ చేసుకునే అవకాశాల్లేవు. దీంతో పొలంలోనో, రోడ్డు పక్కనో కుప్పలుగా పోసి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నిస్సహాయ స్థితినే దళారులు, రైస్‌మిల్లర్లు చక్కగా సొమ్ము చేసుకుంటున్నారు. రూ.లక్షల విలువైన ధాన్యాన్ని సేకరించి రూ.వేలల్లో ఇచ్చి మిగిలిన మొత్తం కోసం నెలల తరబడి తిప్పుకొంటున్నారు. ఈ విధంగా రూ.కోట్లల్లో ఎగ్గొట్టిన రైస్‌మిల్లర్లూ ఉన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం మండలంలో వాహనంలోకి ధాన్యం బస్తాల లోడింగ్

నిలువునా మునిగాం



అప్పులు చేసి వరిని సాగు చేశాం. ధాన్యాన్ని శేఖర్‌బాబుకు విక్రయించి నిట్టనిలువునా మోసపోయాం. డబ్బులివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నగదు ఇప్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– సుధాకర్‌రెడ్డి, వరకవిపూడి

న్యాయం చేయండి మహాప్రభో



ఆరుగాలం శ్రమించి వరిని సాగు చేశాం. వరికోతలు కోసి ధాన్యాన్ని శేఖర్‌బాబుకు విక్రయించాం. అయితే నట్టేట ముంచారు. డబ్బుల కోసం ఆయన చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా అధికారులు స్పందించి ధాన్యం నగదును ఇప్పించేలా చూడాలి.

– పెంచలరెడ్డి, రైతు, ఆత్మకూరు

మిత్రుడ్ని చూసేందుకెళ్లి.. మృత్యుఒడిలోకి

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల మృతి
- మరో ముగ్గురికి గాయాలు

సాక్షి, చెన్నై / నెల్లూరు(క్రైమ్): చెన్నైలోని ఓ కళాశాలలో చదువుతున్న మిత్రుడ్ని చూసి సరదాగా గడపాలని భావించారు. అనుకున్నదే తడవుగా అక్కడికెళ్లి ఉత్సాహంగా గడిపారు. వీరు ఒకటి సంకల్పించగా, విధి మరోలా తలచి రోడ్డు ప్రమాద రూపంలో ఇద్దర్ని పొట్టనబెట్టుకున్న హృదయ విదారక ఘటన చెన్నైలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.

ఆనందం.. అంతలోనే ఆవిరి

పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరుకు చెందిన ధనిష్‌రెడ్డి (21) చెన్నై శివార్లలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నారు.



నుజ్జునుజ్జయిన కారు

నెల్లూరులోని ఓ కళాశాలలో చదువుకుంటున్న శ్రేయాష్ (21), మరో ఇద్దరు విద్యార్థులు.. ధనిష్‌రెడ్డిని చూసేందుకు కారులో వచ్చారు. బుధవారం రాత్రి కలిసి, అర్ధరాత్రి వేళ వీరితో పాటు ధనిష్ కళాశాల మిత్రుడు జయంత్‌తో పాటు కారులో సిటీ వైపు బయల్దేరారు. మార్గమధ్యలో ఊరపాక్కం



శ్రేయాష్, ధనిష్‌రెడ్డి (ఫైల్)

దాటగానే కిలాంబాక్కం బస్ టెర్మినల్‌కు కూతవేటు దూరంలో ముందుగా వెళ్తున్న లారీ హఠాత్తుగా ఆగడంతో వెనుక వేగంగా వస్తున్న కారు ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా, ఘటన స్థలంలోనే ధనిష్‌రెడ్డి, శ్రేయాష్ మరణించారు. గాయపడిన ఇద్దరు విద్యార్థులు, జయంత్‌ను చికిత్స నిమిత్తం పోతేరిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను చెంగల్పట్టు జీహెచ్‌కు తరలించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాలను కుటుంబీకులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శోకసంద్రం

చెన్నై శివార్లలో జరిగిన రోడ్డుప్రమాదంలో నగరానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందడంతో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. స్టోన్‌హౌస్‌పేటకు చెందిన ప్రముఖ ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకుడు సుధాకర్‌రెడ్డి కుమారుడు ఎర్రగుంట ధనిష్‌రెడ్డి, రిత్విక్ ఎన్‌క్లేవ్‌కు చెందిన న్యాయవాది గుడుగుంట వేణుగోపాల్ కుమారుడు శ్రేయాష్ మరణవార్తతో కుటుంబసభ్యులు హతాశులయ్యారు. విషయం తెలుసుకున్న వారు హుటాహుటిన చెన్నై వెళ్లారు. మృతదేహాలు నెల్లూరుకు గురువారం రాత్రి చేరుకున్నాయి. పలువురు ప్రముఖులు నివాళులర్పించి బాధిత కుటుంబాలను ఓదార్చారు.


షాట్‌పుట్ విసురుతూ..


పరుగుకు మేం రెడీ..


800 మీటర్ల పరుగు పందెంలో..

ఫుల్ జోష్..

వారంతా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులు. ఓవైపు ఇంటి బాధ్యతలు.. మరోవైపు విధి నిర్వహణ.. ఎంత పనిఒత్తిడి ఉన్నా అధిగమిస్తూ ముందుకు సాగుతుంటారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గురువారం జరిగిన ఆటల పోటీల్లో ఎండను లెక్క చేయకుండా ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థాయీ భేదం లేకుండా ఉద్యోగినులు ఉల్లాసంగా గడిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


400 మీటర్ల పరుగు పందెంలో..

కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ పరిధి కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో 2025 – 26 విద్యాసంవత్సరానికి ఒకటో తరగతి అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శంకరయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. https://kvsonlineadmission.kvs.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి ఈనెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒకటో తరగతిలో చేరాలనుకునే పిల్లల వయసు మార్చి 31వ తేదీ నాటికి ఆరు సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. 80 సీట్లు ఉన్నాయని, ఆర్‌టీఈ యాక్ట్ కింద 20 సీట్లు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్స్ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆన్‌లైన్ పోర్టల్లో ఉదయం 10 నుంచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెండో తరగతి నుంచి ఆపై తరగతుల వరకు ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారని తెలియజేశారు.

సూపర్ సిక్స్ పథకాల అమలెప్పుడు?



మాట్లాడుతున్న విజయకుమార్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

- నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): 'సూపర్ సిక్స్ హామీలను చంద్రబాబు అటకెక్కించారు. ఈ పథకాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. వాటిని ఎప్పటి నుంచి అమలు చేస్తారు' అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. నెల్లూరు నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి ఇప్పుడు ఆ పథకం గురించి చంద్రబాబు మాట్లాడటమే మరిచిపోయారన్నారు. హామీలను నెరవేర్చకపోవడంతో ప్రజలు తిరగబడే పరిస్థితి ఏర్పడిందన్నారు. అన్నదాత సుఖీభవ ఇస్తామంటూ చంద్రబాబు రైతులను నట్టేట ముంచారన్నారు. తల్లికి వందనం నేటికీ కార్యరూపం దాల్చలేదని చెప్పారు. వలంటీర్లకు రూ.10 వేలు జీతం పెంచి ఇస్తామన్నారని, ఇప్పుడు వారి గురించి పట్టించుకోవడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ వారికి ఏ పనులు చేయొద్దని చిత్తూరు జిల్లాలో జరిగిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడారని, ఇటువంటి పరిస్థితి రాష్ట్ర చరిత్రలో లేదన్నారు. ఎంతోమంది ముఖ్యమంత్రులుగా పనిచేశారని ఎవరూ ఇలా మాట్లాడిన సందర్భాల్లేవన్నారు. ఆయన మాటలు శాడిజానికి నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో కులమతాలు, ప్రాంతాలు, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించారన్నారు. తమ నాయకుడికి ప్రజల మద్దతు ఉందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను జగన్ ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచుతున్నారన్నారు. దీనిని తట్టుకోలేక అధికార పార్టీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. హామీల అమలు కోసం ప్రజల తరఫున పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాసయాదవ్, సత్తార్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, రావు శ్రీనివాసరావు, మదన్‌మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఆదిరెడ్డి, సుబ్బారెడ్డి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

కుమార్తె కళ్లెదుటే ప్రాణాలు విడిచి..

- స్కూటీని ఢీకొన్న ఆటో
- తల్లిదండ్రుల మృతి
- సైదాపురంలో విషాదం


మునెయ్య (ఫైల్)


జ్యోతి (ఫైల్)


ఘటనా స్థలంలో స్కూటీ

సైదాపురం/గూడూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో కుమార్తె కళ్లెదుట తల్లిదండ్రులు ప్రాణాలు విడిచారు. ఏడుస్తున్న చిన్నారిని చూసిన స్థానికులు కంటతడి పెట్టారు. 14, 12 సంవత్సరాల వయసున్న ఇద్దరు కుమార్తెలకు అన్నీ తామై చూడాల్సిన దంపతులను ఆటో రూపంలో మృత్యువు కబళించిన ఘటన గురువారం రాత్రి సైదాపురం – తిప్పవరప్పాడు మార్గంలో జరిగింది. స్థానికులు, గూడూరు రూరల్ పోలీసుల కథనం మేరకు.. సైదాపురానికి చెందిన దొడ్డగ మునెయ్య దుస్తుల దుకాణం నడుపుతుంటాడు. అతడి భార్య జ్యోతి కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేందుకు టైలరింగ్ చేస్తోంది. వారికి నిహారిక, వైష్ణవి అనే ఇద్దరు కుమార్తెలున్నారు. బాలికలు స్థానికంగా ఉన్న పాఠశాలలో చదువుతున్నారు. మునెయ్య బంధువులు కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్నారు. వారి వద్దకు గురువారం ఉదయం అతను, జ్యోతి, చిన్న కుమార్తె వైష్ణవి స్కూటీపై వెళ్లారు. రాత్రి తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో సైదాపురం నుంచి గూడూరు వైపునకు వస్తున్న ఆటో ఆ స్కూటీని ఢీకొని బోల్తా పడింది. మునెయ్య, జ్యోతి అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన వైష్ణవిని చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో సైదాపురంలో విషాదం నెలకొంది.

ఇంటర్ పరీక్షలకు 1,002 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్): ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు గురువారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,002 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్‌కు సంబంధించి 28,376 మందికి గానూ 27,539 మంది హాజరయ్యారు. 837 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 1,399 మందికి గానూ 1,234 మంది హాజరయ్యారు. 165 మంది గైర్హాజరయ్యారు. నెల్లూరు ఫత్తేఖాన్‌పేటలోని విశ్వసాయి, రవీంద్రభారతి, రావూస్, కృష్ణచైతన్య, అరవింద్‌నగర్‌లోని నారాయణ జూనియర్ కళాశాలల్లో పరీక్షల నిర్వహణను ఆర్‌ఐఓ ఆదూరు శ్రీనివాసులు పరిశీలించారు.

నష్టపరిహారం ఇవ్వలేదని..


- నూతన రోడ్డును ధ్వంసం చేసిన రైతులు


రోడ్డును ధ్వంసం చేస్తూ..

ఆత్మకూరు: నష్టపరిహారం చెల్లించలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా వేస్తున్న రోడ్డును ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరు మండలంలోని రామస్వామిపల్లి నుంచి గండ్లవేడు వరకు కొత్తగా రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గ్రామంలో సర్వే నంబర్లు 189, 190ల్లో పక్కా పట్టా భూమిలో రోడ్డు నిర్మాణం గురించి తమకు తెలపకపోవడం, నష్టపరిహారం ఇవ్వలేదని కోపగించుకున్న రైతులు ట్రాక్టర్ ద్వారా గురువారం రోడ్డును ధ్వంసం చేశారు. దీనిపై కాంట్రాక్టర్, అధికారులను ప్రశ్నించారు. కాగా ఈ విషయమై సంబంధిత కాంట్రాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

- ఆన్‌లైన్ గేమ్స్, కోడిపందేల్లో డబ్బు పోగొట్టుకున్న వైనం



మురళి మృతదేహం

నెల్లూరు సిటీ: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు రూరల్ మండలంలో జరిగింది. గురువారం పోలీసులు వివరాలు వెల్లడించారు. రూరల్ మండలంలోని పొట్టేపాళెం గ్రామంలో గొట్టేటి మురళి (48) నివాసం ఉంటున్నాడు. అతడికి భార్య సలోమి, కుమారుడు, కుమార్తె సంతానం. మురళి గతంలో ఆటో నడిపాడు. ఇటీవల కూలీగా వెళ్తున్నాడు. అతడిని ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. ఆన్‌లైన్ గేమ్స్, కోళ్లపందేలు ఆడి కొంతమేర డబ్బు పోగొట్టుకున్నాడు. ఓవైపు అప్పులు, మరోవైపు ఇంటి పోషణ కష్టమవడంతో మానసికంగా కుంగిపోయాడు. బుధవారం ఇంటి వద్ద గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	105
లేయర్ (లైవ్) :	90
బ్రాయిలర్ చికెన్ :	190
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	212
లేయర్ చికెన్ :	153

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.88
సన్నవి :	రూ.60
పండ్లు :	రూ.40

బాలిక అదృశ్యం

సోమశిల: పాఠశాలకు వెళ్లిన బాలిక అదృశ్యమైన ఘటన గురువారం జరిగింది. సోమశిల ఎస్సై అనూష కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. అనంతసాగరం మండల పరిధిలోని సోమశిల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓ బాలిక 8వ తరగతి చదువుతోంది. గురువారం ఉదయం బాలిక ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్లింది. కాసేపటికి నమిత కనిపించకపోవడంతో టీచర్లు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

- ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు


ఘటనా స్థలంలో బస్సు

కందుకూరు రూరల్: కందుకూరు నుంచి ఒంగోలు వెళ్తున్న కందుకూరు డిపోకు చెందిన ఆర్టీసీ నాన్ స్టాప్ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికుల కథనం మేరకు.. గురువారం ఓవీ రోడ్డులో బస్సు వేగంగా వెళ్తోంది. ఈ క్రమంలో 167బీ జాతీయ రహదారి మూడు రోడ్ల కూడలి వద్ద డ్రైవర్ స్పీడ్ బ్రేకర్‌ను తప్పించబోయాడు. దీంతో వాహనం సైడుకు వెళ్లింది. ఈ సమయంలో కంట్రోల్ తప్పి హైవే మార్జిన్‌లోకి వెళ్లింది. టైర్లు అక్కడ కొత్తగా పోసిన మట్టిలోకి దిగాయి. అంతే కాకుండా పెద్ద రాళ్లు ఉండటంతో బస్సు అదుపు తప్పకుండా ఆగిపోయింది. అప్పటికే అందులో ఉన్న ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. బోల్తా పడకుండా నిలిచిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. స్పీడ్ బ్రేకర్ వద్ద వేగం తగ్గించి బస్సును సైడుకు తిప్పకుండా ఉంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదని ప్రయాణికులు చెబుతున్నారు.